క్లుప్తంగా

రేపటి నుంచి ఉచిత యోగా శిక్షణ

ఇబ్రహీంపట్నం: స్థానిక ఎస్వీసీటీ కల్యాణ మండపంలో శాంతివన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి 30వ తేదీ వరకు ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు లంకే జనార్దన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం, సాయంత్రం రెండు పూటలా రెండు బ్యాచ్‌లుగా శిక్షణ ఉంటుందన్నారు. దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు యోగాలోని వివిధ అంశాలపై అవగాహన కల్పించి, శిక్షణ ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 63014 54859లో సంప్రదించాలన్నారు.

లయన్స్ సమత క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

తిరువూరు: తిరువూరు లయన్స్ క్లబ్‌కు అనుబంధంగా ఉన్న సమతా క్లబ్‌కు నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కంచర్ల శశికళ, కొమ్మినేని సహజ, కోశాధికారిగా పసుమర్తి వెంకటరమణకుమారి ఎన్నికయ్యారు. లయన్స్ క్లబ్ సభ్యులు కె.ముత్యప్రసాద్, ఎస్. జనార్దనరావు, పీవీరావు, కె. రాజేష్‌ఖన్నా తదితరులు నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

కట్టలేరు మరమ్మతులు ప్రారంభం



తిరువూరురూరల్: మండలంలోని ఏడు గ్రామాల్లో భూములకు సాగునీరందించే కట్టలేరు సప్లయ్‌చానల్‌కు అత్యవసర మరమ్మతు పనులను సాగునీటి సంఘం అధ్యక్షుడు తుమ్మలపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం చేపట్టారు. సప్లయ్‌చానల్ పూడిక తీయడంతో పాటు కట్టలకు పడిన గండ్లకు మరమ్మతు చేపట్టారు. ఖరీఫ్ సీజన్ నాటికి కట్టలేరు నుంచి చెరువులకు సాగునీరు సరఫరా చేయడానికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని శ్రీనివాసరావు తెలిపారు.

ముసునూరు తహసీల్దార్‌గా ప్రశాంతి!

ముసునూరు: మండల తహసీల్దార్‌గా డి.ప్రశాంతి నియమితులైనట్లు రెవెన్యూ వర్గాలు తెలిపాయి. గతంలో చాట్రాయి తహసీల్దార్‌గా పనిచేసి సస్పెన్షన్‌లో ఉన్న ఆమెను ముసునూరు తహసీల్దార్‌గా నియమిస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి సోమవారం ఆదేశాలు అందినట్లు పేర్కొంటున్నారు. కాగా మంగళ, బుధవారాల్లో ముసునూరు తహసీల్దార్‌గా ఆమె బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం. గత కొద్ది రోజుల క్రితం చాట్రాయి తహసీల్దార్‌గా కొనసాగించేందుకు జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు ఇవ్వగా, అక్కడి టీడీపీ నేతలు తిరస్కరించడంతో తహసీల్దార్ నియామకం నిలిచిపోయింది. తాజాగా ఆమెను ముసునూరు మండల తహసీల్దార్‌గా నియమిస్తూ ఆదేశాలు వెలువడడంతో రెవెన్యూ వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి.

సినీ నటుడు కోట శ్రీనివాసరావుకు నివాళి



వెలగలేరు(జికొండూరు): సినీనటుడు కోట శ్రీనివాసరావు శ్రద్ధాంజలి కార్యక్రమం మండలంలోని వెలగలేరు గ్రామంలో ఆదర్శ గ్రామీణ సాంస్కృతిక సేవ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంస్థ అధ్యక్షుడు మందాడి శ్రీనివాసరావు మాట్లాడుతూ భారతదేశం గర్వించదగిన నటుడు కోట శ్రీనివాసరావు మరణం తమ అందరి హృదయాలను కలచి వేసిందన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పోలుదాసు రంగనాయకులు, సభ్యులు పోలుదాసు వెంకటరావు, సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ఆగిరిపల్లి: పరిసరాల పరిశుభ్రత గురించి విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని కొండపల్లి గేల్ ఇండియా లిమిటెడ్ సంస్థ డీజీఎం కృపాశంకర్ తెలిపారు. మండలంలోని ఈదర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్వచ్ఛత పక్వాడ్ వారోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలకు క్లీనింగ్ మెటీరియల్, విద్యార్థినులకు శానిటరీ న్యాప్‌కిన్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ

ఆగిరిపల్లి: ప్రజా సమస్యలు పరిష్కరించడానికి పోలీస్ శాఖ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఎస్ఐ శుభశేఖర్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. కుటుంబ కలహాల నేపథ్యంలో రెండు ఫిర్యాదులు వచ్చాయని వాటిని సానుకూలంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

వంతెనలు.. పొంచి ఉన్న ప్రమాదాలు



గుర్రాజుపాలెం గ్రామం వెళ్లే వాగుపై ప్రమాదకరంగా వంతెన



చంద్రాలలో సైడ్ వాల్స్ కూలిపోయి ప్రమాదకరంగా ఉన్న వంతెన

మరమ్మతులు చేయించాలని స్థానికుల వినతులు

మైలవరం: మైలవరం నియోజకవర్గంలోని పలు వాగులపై ఏర్పాటు చేసిన చప్టాలు, వంతెనలు ప్రమాదకరంగా మారాయి. ప్రజలు, ఉద్యోగస్తులు, కార్మికులు ఇతర ప్రాంతాలకు పనులకు పోయి రాత్రికి తిరిగి వస్తుంటారు. దీంతో ఈ వంతెనలపై వాహనాలు రాకపోకలు కూడా బాగా పెరిగాయి. ముఖ్యంగా పుల్లూరులో వాగుపై కట్టించిన చప్టా వర్షాకాలంలో నీటి ప్రవాహం పెరిగి మునిగిపోతోంది. దీనితో పుల్లూరు, సీతారామపురం తండా మొర్సుమల్లి, జమలాపురం, ఖమ్మం వెళ్లే వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే గుర్రాజుపాలెం గ్రామం వద్ద ఉన్న వంతెన కూడా శిథిలావస్థకు చేరుకుంది. అదే విధంగా చంద్రాల వద్ద ఉన్న వంతెన కూడా సైడ్ రైలింగ్ కూలిపోయి ప్రమాదకరంగా మారింది. ఈ వంతెన మీదుగా నూజివీడు, ఏలూరు, ద్వారకాతిరుమల వెళ్లే వాహనాలు ఎక్కువగా ప్రయాణం చేస్తుంటాయి.

హామీ నిలబెట్టుకోవాలి..

తాను ఎమ్మెల్యేగా గెలిస్తే నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కరిస్తానని చెప్పిన ప్రస్తుత కూటమి ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ గ్రామ సమస్యలు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి నియోజకవర్గంలోని వాగులపై నిర్మించిన చప్టాలు, వంతెనలు మరమ్మతులు చేయించాలని, ఆయా గ్రామాల ప్రజలకు ఎటువంటి ప్రమాదం జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకుని, వంతెనలు అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

> **వంతెనలకు మరమ్మతులు చేయాలి..**
>
> నియోజకవర్గంలోని వాగులపై వంతెనలు, చప్టాలు ప్రమాదకరంగా ఉన్నాయి.. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా వాగుల్లో పడిపోవడం జరుగుతోంది. వాగులు ప్రవహిస్తున్న సందర్భాలలో ఎంతో అప్రమత్తంగా ఉండాలి. లేకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.
>
> – డి. చలపతిరావు, పొందుగల, మైలవరం

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారమే ఉత్తమ మార్గం



నూజివీడులోని కోర్టు హాల్‌లో సమావేశం నిర్వహిస్తున్న జడ్జి నాగశైలజ

నూజివీడు: మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారమే ఉత్తమమైన మార్గమని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ అన్నారు. స్థానిక న్యాయస్థానాల ఆవరణలో మీడియేషన్ ఫర్ ద నేషన్ కార్యక్రమంలో భాగంగా న్యాయవాదులకు, బీమా సంస్థలు, చిట్ ఫండ్స్, బ్యాంకు అధికారులకు సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మధ్యవర్తిత్వంపై నేడు ప్రచారం జరుగుతోందన్నారు. వివాహ సంబంధిత వివాదాలు, ప్రమాద కేసులు, గృహ హింస కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కమర్షియల్ కేసులు, వినియోగదారుల కేసులు, భూముల పంపకాల కేసులు, భూసేకరణ తదితర కేసులన్నింటినీ మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెద ఖాసీం, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఓ.అనూష, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రావణి, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ప్లీనరీ విజయవంతం చేద్దాం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి క్రాంతి పాఠశాలలో ఆగస్టు 9, 10 తేదీలలో జరగనున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశం విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ప్లీనరీ సమావేశాల వాల్ పోస్టర్లు క్రాంతి పాఠశాలలో సోమవారం ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోపీ నాయక్, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏటా ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నప్పటికీ సంక్షేమ హాస్టళ్లు, విద్యాలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పించ లేదన్నారు. ఎన్నికలకు ముందు నారా లోకేష్ 77 జీవో రద్దు చేసి పీజీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్ చేస్తామని చెప్పారని, నేటికీ హామీ అమలు చేయలేదన్నారు. జిల్లాలో విద్యార్థుల సమస్యలపై జిల్లా ప్లీనరీ సమావేశంలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు మురళీమోహన్, ఎస్ఎఫ్ఐ జిల్లా నేత ఎం. మహేష్, మండల కార్యదర్శి కుశాల్ పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ స్మరణ్‌రాజ్

నూజివీడు: ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం సబ్‌కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి వాటి పరిష్కార నిమిత్తం సంబంధిత అధికారులకు పంపారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారానికి నిర్దిష్ట కాలపరిమితిని విధించామని, అయితే గడువు ముగిసే ఆఖరి రోజు వరకు జాప్యం చేయకుండా పరిష్కరించదగిన సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. అర్జీలు అందజేసిన ప్రజలకు నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలన్నారు. ఒకవేళ పరిష్కరించలేకపోతే దానికి సంబంధించిన సరైన కారణాన్ని అర్జీదారుడికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజల వద్ద నుంచి 28 అర్జీలు రాగా వాటిని సంబంధిత అధికారులకు పంపారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ సుందరి, డీఎల్‌డీఓ వెంకటరత్నం, హెచ్ఓ ఆర్.హేమ తదితరులు పాల్గొన్నారు.

వచ్చిన అర్జీల్లో కొన్ని..

- తన కుమారుడు నాలుగో తరగతి చదువుతున్నాడని, అయితే ప్రభుత్వం విడుదల చేసిన తల్లికి వందనం పథకంలో రూ.13వేలు పడలేదని, తనకు న్యాయం చేయాలని పట్టణంలోని బొందిలిపేటకు చెందిన రాజేశ్వరి సబ్‌కలెక్టర్‌కు అర్జీ అందజేశారు.
- తమకు విద్యుత్ కనెక్షన్ లేకపోయినా మూడు విద్యుత్ కనెక్షన్లు ఉన్నట్లు ఆధార్‌కు అనుసంధానం కావడంతో తమ ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం నగదు రాలేదని ఆగిరిపల్లి మండలం వట్టిగుడిపాడుకు చెందిన అబ్బూరి శ్రీలత ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు తనకు న్యాయం చేయాలని సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.
- మూడు తరాలుగా తాము భూములు సాగుచేస్తున్నప్పటికీ ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడం దారుణమని, దాదాపు నాలుగు వందల మంది రైతులు ఆరు వందల ఎకరాలు వరకు సాగు చేస్తున్నామని, గతేడాది వరకు రైతుభరోసాను తీసుకున్నామని ఇప్పుడు చూస్తే ఆన్‌లైన్‌లో లేవని తమకు న్యాయం చేయాలని కోరుతూ నూజివీడు మండలం పాతరావిచర్లకు చెందిన రైతులు అర్జీని అందజేశారు.

జెడ్పీ చైర్‌పర్సన్ హారికపై దాడి అమానుషం

చాట్రాయి: కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక దంపతులపై టీడీపీ గుండాలు చేసిన దాడి అమానుషమని మండల వైఎస్సార్ సీపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా పాలన జరగకుండా దాడులు, కేసులకే పరిమితం అవుతున్నారని వారు విమర్శించారు. రాష్ట్రంలో అమలవుతోన్న రెడ్ బుక్ రాజ్యాంగ పాలనలో ఒక బీసీ మహిళా ప్రజా ప్రతినిధిపై అన్యాయంగా దాడి చేశారని సాధారణ మహిళలు రోడ్డున తిరిగే పరిస్థితి ఈ కూటమి ప్రభుత్వం లేదని వారు మండిపడ్డారు. రాష్ట్ర వైఎస్సార్ సీపీ బీసీ సెల్ కార్యదర్శి పరసా చెన్నారావు, వైఎస్సార్ సీపీ నూజివీడు నియోజకవర్గ పంచాయతీ రాజ్ అధ్యక్షుడు చెలికాని బాబ్జీ, మండల పార్టీ అధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



జి.కొండూరులో తనిఖీ నిర్వహిస్తున్న విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు

జికొండూరు: మండల కేంద్రంలోని ఎరువులు, విత్తనాల విక్రయ దుకాణాల్లో విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. బిల్లులు లేకుండా విత్తనాలు విక్రయించడాన్ని గుర్తించారు. విజిలెన్స్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ ఏడీఏ హనుమంతరావు పర్యవేక్షణలో ధీరజ్‌కృష్ణ ఎంటర్ ప్రైజెస్, కోరమండల్ ఇంటర్నేషన్ లిమిటెడ్ దుకాణాల్లో తనిఖీలు జరిపారు. కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ (మనగ్రోమోర్ సెంటర్)లో కేడీసీహెచ్‌హెచ్– 9632, ఆర్ఏసీహెచ్‌హెచ్– 011 రకం పత్తి విత్తనాలకు సోర్స్ ఆఫ్ సర్టిఫికెట్ చూపించకపోవడంతో రూ.45,050 విలువైన విత్తనాల విక్రయాలు నిలిపివేసినట్లు తెలిపారు. మండల వ్యవసాయ అధికారి సూరిబాబు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



దివ్యాంగులకు కృత్రిమ కాళ్లను అందజేస్తున్న దాతలు

ఆగిరిపల్లి: దివ్యాంగులకు దాతలు ఇస్తున్న సహకారం అభినందనీయమని హీల్ పాఠశాల సీఈఓ కూరపాటి అజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని తోటపల్లి హీల్ పాఠశాలలో చుండూరు కోటయ్య, రామశేషమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహకారంతో 13 మంది దివ్యాంగులకు కృత్రిమ కాళ్లను అందజేశారు. ఈ సందర్భంగా సీఈఓ అజయ్ కుమార్ మాట్లాడుతూ ఇప్పటి వరకు హీల్ అవయవ కేంద్రంలో 729 మంది దివ్యాంగులకు కృత్రిమ కాళ్లను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో చుండూరు కోటయ్య, రామశేషమ్మ చారిటబుల్ ట్రస్టు అధినేత మధుసూదన్ రావు, హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి, ఫెసిలిటీస్ డైరెక్టర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆషాఢ సారె సమర్పణ



చెక్కపల్లిలో అమ్మవారికి సారె సమర్పించేందుకు వస్తున్న మహిళా భక్తులు



చాట్రాయిలో అమ్మవారికి సారె సమర్పిస్తున్న మహిళలు

ముసునూరు: చెక్కపల్లిలో కొలువైన అమ్మవార్లకు భక్తులు ఆషాఢమాస చీర, సారె, పసుపు కుంకుమలు సమర్పించారు. మండలంలోని చెక్కపల్లికి చెందిన 100 మంది మహిళలు సోమవారం గ్రామంలోని దుర్గమ్మ తల్లి, లక్ష్మీదేవి ఆలయాలకు తరలివెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

చాట్రాయిలో..

చాట్రాయి: ఆషాఢమాసం సందర్భంగా మండలంలోని కోటపాడు గ్రామంలోని పాత రామాలయంలో సీతమ్మ అమ్మవారికి మహిళలు సోమవారం సారె సమర్పించారు. ఈ సందర్భంగా పసుపు కుంకుమ, గాజులు చీరను తలపై పెట్టుకొని జై శ్రీరామ్ అంటూ మంగళ వాయిద్యాలతో అమ్మవారికి సమర్పించారు.

కార్మిక సమస్యలపై ఉదాసీనత సరికాదు



తిరువూరు నగరపంచాయతీ ఎదుట కార్మికుల ధర్నాలో పాల్గొన్న స్వామిదాసు



నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నేతలు

తిరువూరు: కార్మికుల న్యాయమైన కోర్కెలు తీర్చడంలో ప్రభుత్వం ఉదాసీన వైఖరి అవలంభిస్తోందని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు విమర్శించారు. రెండు రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న తిరువూరు నగర పంచాయతీ ఇంజినీరింగ్ కార్మికులు కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నా శిబిరంలో స్వామిదాసు పాల్గొని సంఘీభావం తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఇంజినీరింగ్ కార్మికులు ఎంతోకాలంగా కోరుతున్నా ప్రభుత్వం పెడచెవిన పెడుతోందని స్వామిదాసు ఆరోపించారు. పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గోపాల నాగేశ్వరరావు, ట్రేడ్ యూనియన్ తిరువూరు నియోజకవర్గ అధ్యక్షుడు యరదేశి రామారావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ, పార్టీ నాయకులు వెలుగోటి ఆదినారాయణ, రేగళ్ల మోహన్ రెడ్డి, షేక్ జాకీర్, బొర్రా మోహన్‌రావు, ఇనపనూరి రవి, పాపారావు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజు కొనసాగిన కార్మికుల సమ్మె..



కొండపల్లిలో సమ్మె చేస్తున్న మునిసిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మునిసిపాల్టీ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె రెండోరోజు సోమవారం కూడా కొనసాగింది. ప్రజలకు తాగునీటి సరఫరా జరగక పోయినా, పైప్‌లైన్ పగిలి మరమ్మతులు జరగకున్నా, వీధిలైట్లు వెలగక పోయినా ప్రభుత్వమే బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ కార్మికులకు ఆరోగ్య బీమా కల్పించాలన్నారు.

సమస్యలను పరిష్కరించాలని ధర్నా..

నూజివీడు: చాట్రాయి మండలం చిత్తపూరులో పేదలు సాగు చేస్తున్న సర్వే నంబర్ 1–4 అటవీశాఖ ఫోర్ నోటిఫికేషన్‌లో లేనందున రెవెన్యూ, అటవీశాఖ అధికారులు జాయింట్ సర్వే చేసి విడగొట్టి పేదలు సాగు చేసుకుంటున్న 125 ఎకరాలకు పట్టాలివ్వాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరినాథ్ డిమాండ్ చేశారు. పేదల సమస్యల పరిష్కారం నిమిత్తం పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం సీపీఐఎంఎల్ లిబరేషన్, అఖిల భారత కిసాన్ మహాసభ సంయుక్త ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్‌కు వినతి పత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఏడేళ్లుగా జీతాలు పెంచకపోవడం దారుణం

నూజివీడు: మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బందికి ఏడేళ్లుగా జీతాలు పెంచకుండా శ్రమ దోపిడీ చేయడం దారుణమని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జి.రాజు అన్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో నూజివీడు మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ విభాగంలోని కార్మికులు సోమవారం నుంచి సమ్మె బాట పట్టారు. సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు ఎస్ఆర్ హనుమాన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నూజివీడులో ట్యాంకర్లతో మంచినీటి సరఫరా

నూజివీడు: మునిసిపల్ ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది సమ్మెలో ఉన్నందున ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్యాంకర్లతో మంచినీటి సరఫరా చేస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీధిలైట్ల నిర్వహణ, పారిశుద్ధ్య నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. పట్టణంలో ఎక్కడైనా మంచినీటి ఇబ్బందులు తలెత్తితే వెంటనే మున్సిపల్ కార్యాలయానికి తెలియజేస్తే ట్యాంకర్లను పంపుతామన్నారు.

ఐటీఐ అడ్మిషన్ల గడువు పొడిగింపు

నూజివీడు: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో చేరేందుకు అడ్మిషన్ల గడువును ఈ నెల 20 తేదీ ఐదు గంటల వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.రజిత సోమవారం తెలిపారు. దీనిలో భాగంగా దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను ఈ నెల 21న కళాశాలకు తీసుకొచ్చి వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ఈ నెల 24న నిర్వహించే కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టాలని వినతి

విస్సన్నపేట: దోమలు ప్రజలపై దండయాత్ర చేస్తున్నాయని, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి వి. నాగరాజు కోరారు. మండల కేంద్రమైన విస్సన్నపేటలో దోమలు, కుక్కలు, కోతుల నుంచి ప్రజల్ని కాపాడాలన్నారు. పాఠశాలలు ప్రారంభం అవ్వటంతో చిన్న పిల్లలు పాఠశాలకు వెళ్లి వచ్చే సమయంలో కోతులు, కుక్కలు దాడులు చేస్తున్నాయని వాటిని పట్టించి గ్రామానికి దూరంగా తరలించాలని కోరుతూ ఎంపీడీఓ చేకు చిన్నరాట్నాలు, ఈఓ హరికృష్ణకుమార్‌కు సోమవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. మేకలజ్ఞానరత్నం, ధనలక్ష్మి, రంగారాణి పాల్గొన్నారు.

బ్రిక్స్ కంపెనీ వద్ద రైతుల నిరసన

కవులూరు(జికొండూరు): స్థానికంగా ఉన్న లైట్ వెయిట్ బ్రిక్స్ కంపెనీ యాజమాన్యం తీరుపై స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కంపెనీ వాహనాలతో రోడ్లు గుల్లవుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కంపెనీ యాజమాన్యం రైతులపై దురుసుగా వ్యవహరించడం వల్ల సోమవారం ఎన్విఎల్ బిల్డ్ టెక్ కంపెనీ మెయిన్ గేటుకు తాళం వేసి రైతులు నిరసన వ్యక్తం చేశారు. రోడ్డుకు రెండు వైపులా భారీసైజు వాహనాలు నిలుపుదల చేయడంతో పాటు ఓవర్ లోడుతో కంపెనీ లారీలు నడవడం వల్ల రోడ్డు ఛిద్రమవుతోందని రైతులు ఆరోపించారు. గుల్లబారిన రోడ్లపై ప్రజలు రాకపోకలు చేయడం ఇబ్బందిగా మారిందని రైతులు తెలిపారు. అధికారులు జోక్యం చేసుకుని కంపెనీ యాజమాన్యంపై తక్షణం చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. లేని పక్షంలో నిరసనలు గ్రామస్తులతో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

చాట్రాయి: నాటు సారా తయారీ కేంద్రాలపై దాడి చేసినట్లు నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని పోలవరంలో నాటు సారా తయారీకి సిద్ధంగా ఉన్న 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు. తయారీదారుడు కలవకల్లు రెడ్డియ్యపై కేసు నమోదు చేశామని పోతనపల్లి తండాకు చెందిన పాత నేరస్తుడు బాణావతు శివాజీని అదుపులోకి తీసుకున్నట్లు ఆయన చెప్పారు. అదే గ్రామానికి చెందిన ధారావతు నాగరాజు వద్ద 5 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి తిరువూరు కోర్టుకు రిమాండ్ నిమిత్తం తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఎల్‌బీఆర్‌సీఈ అధ్యాపకుడికి పీహెచ్‌డీ



రాజేంద్రను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు

మైలవరం: స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకుడు పీహెచ్‌డీ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు సోమవారం తెలిపారు. కళాశాలలో ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం అధ్యాపకుడైన జి. రాజేంద్ర రాయలసీమ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో 'యాన్ ఇంప్రూవ్డ్ ఆర్టిఫిషియల్ న్యూరల్ ఫజ్జీ సిస్టమ్ ఫ్రేమ్ వర్క్ టూ కంట్రోల్ క్వాలిటీ ప్రెడిక్షన్ ఇన్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్' అనే అంశంపై చేసిన పరిశోధనకు పీహెచ్‌డీని ప్రదానం చేసినట్లు చెప్పారు. దీని ద్వారా అభివృద్ధి దశలోనే లోపాలను గుర్తించి, నాణ్యతను మెరుగుపర్చడంతో పాటు వ్యయాన్ని తగ్గించడం, వినియోగదారులకు సంతృప్తిని అందించడానికి సహాయపడుతుందన్నారు. కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, ఐటీ విభాగాధిపతి డాక్టర్ డి. రత్నకిశోర్, ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ఆయనను అభినందించారు.